


# EVENING EDITION

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

4PM

www.suryaa.com

బుధవారం

01 మే 2024

పేజీలు: 02





## ఇవాళే మేడే కార్మిక దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికుల కష్టాన్ని, సహకారాన్ని గుర్తిస్తూ.. ప్రతి సంవత్సరం మే 1వ తేదీన మేడే నిర్వహిస్తారు. దీనినే అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం అని కూడా పిలుస్తారు. కార్మికుల సహకారాన్ని గుర్తుచేయడమే కాకుండా.. కార్మికుల హక్కులను గుర్తుచేస్తూ.. సమాజానికి వారు చేస్తున్న సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నారు.

19వ శతాబ్దంలో ప్రారంభమైన కార్మిక దినోత్సవం కార్మిక దినోత్సవాన్ని 19వ శతాబ్ధం నుంచి యూనైటెడ్ స్టేట్స్ నిర్వహించినట్లు చరిత్ర చెప్తోంది. దానికి బీజం 1886లో ప్రారంభమైంది. 1886లో మే 1వ తేదీన దాదాపు రెండు లక్షలమంది కార్మికులు.. తమ శ్రమను గుర్తిస్తూ.. రోజుకు ఎనిమిది గంటల పనిదినాన్ని డిమాండ్ చేస్తూ భారీ సమ్మెను చేశారు. ఆ సమయంలో ఈ ఉద్యమం హింసాత్మకంగా మారింది.





## ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 60కిపైగా పాఠశాలలకు

# బాంబు బెదిరింపులు

## ఉలిక్కిపడ్డ రాజధాని ప్రాంతం

దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల క్రితం దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దేశరాజధాని ఢిల్లీలోని సుమారు 50 పాఠశాలలకు బుధవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని పలు ప్రముఖ స్కూళ్లకు బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. రాజధానిలోని ద్వారక, వసంత్ కుంజ్, తూర్పు మయూర్ విహార్‌లోని మదర్ మేరీ స్కూల్, సంస్కృతి స్కూల్, పుష్ప విహార్‌లోని అమిటీ స్కూల్, సౌత్ వెస్ట్ ఢిల్లీలోని డీపీవీ స్కూల్స్‌కు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. అదేవిధంగా నోయిడాలోని సుమారు 12 పాఠశాలలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో పాఠశాలలకు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు చెప్పారు. దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బందిని ఇంటికి పంపించేశారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అయితే, అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలూ వారికి కనిపించలేదు. దీంతో కేసు నమోదు చేసుకొని ఈమెయిల్ ఐపీ అడ్రస్ ద్వారా ఆగంతకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి ఇన్నిపాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడంతో రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మరోవైపు ఈ బాంబు బెదిరింపులపై ఢిల్లీ మంత్రి అతిషీ స్పందించారు. ఢిల్లీ పోలీసులు, పాఠశాల అధికారులతో ప్రభుత్వ అధికారులు నిరంతరం టచ్‌లో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ భయపడొద్దని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈరోజు ఉదయం కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించారు. ఆయా పాఠశాలల ప్రాంగణాల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ పాఠశాలలోనూ ఎలాంటి పేలుడు పదార్థాలూ లభ్యం కాలేదు. మేము పోలీసులు, పాఠశాలల యాజమాన్యాలతో నిరంతరం టచ్‌లో ఉన్నాము. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు భయపడొద్దు' అని అతిషీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఢిల్లీలో పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. దీంతో అది నకిలీ బెదిరింపు అయి ఉంటుందని పోలీసులు అప్పట్లోనే వెల్లడించారు. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.



## భర్త పార్లమెంటుకు.. భార్య అసెంబ్లీకి పోటీ

చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దంపతులు ఎన్నికల బరిలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. పోలాకి మండలం యాట్ల బసివలస గ్రామానికి చెందిన కాయ దుర్గారావు, ఆయన భార్య కామేశ్వరి నరసన్నపేటలోని పెద్దపేట సమీపంలో చేపలు విక్రయిస్తుంటారు. దాదాపు 10 కి.మీ. దూరం నుంచి నరసన్నపేటకు వచ్చి చేపలు అమ్ముకునే వీరికి ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆలోచన వచ్చింది. ప్రస్తుతం వేట నిలిచిపోవడంతో వారి వ్యాపారానికి కూడా విరామం వచ్చింది. దీంతో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి భర్త, నరసన్నపేట అసెంబ్లీ నుంచి భార్య పోటీకి దిగారు. పేదరికంలో ఉన్న తాము డీపట్టా భూముల సమస్యపై 2020 నుంచి తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయిందని, అందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని దుర్గారావు వివరించారు.



## తప్పుడు కేసులతో భర్తను వేధించడం క్రూరత్వమే

### బాంబే హైకోర్టు

లేనిపోని ఆరోపణలతో భర్త, అతని బంధువులపై కేసులు నమోదు చేసి వేధించడాన్ని క్రూరత్వ చర్యగానే పరిగణించాల్సి ఉంటుందని బాంబే హైకోర్టులోని ఔరంగాబాద్ ధర్మాసనం స్పష్టం చేసింది. కుటుంబ న్యాయస్థానం జారీ చేసిన విడాకులను రద్దు చేసి, దాంపత్య హక్కులను పునరుద్ధరించాలన్న ఓ మహిళ వినతిని తోసిపుచ్చుతూ న్యాయమూర్తి జస్టిస్ వై.జి.ఖోబ్రగడే తీర్పు వెలువరించారు. 2004లో వివాహమైన జంట 2012 వరకు కలిసి ఉన్నారు. ఆ తర్వాత తన పుట్టింటికి వెళ్లిన భార్య.... వేధింపుల ఆరోపణలతో భర్త, అతని తండ్రి, సోదరుడిపై పోలీసు కేసులు పెట్టారు. అయితే, న్యాయస్థానాలు వారిని నిర్దోషులుగా ప్రకటించాయి. తప్పుడు కేసులు పెట్టి మానసిక వేదనకు గురిచేసిన భార్యతో వైవాహిక బంధాన్ని ముగించుకోవడానికి అనుమతించాలంటూ భర్త కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2023లో విడాకులు మంజూరయ్యాయి. దీనిని సవాల్ చేస్తూ మాజీ భార్య హైకోర్టును ఆశ్రయించారు.

## లోయలో పడ్డ బస్సు.. నలుగురు మృతి



తమిళనాడు రాష్ట్రంలో బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. సేలంలోని ఏర్కాడ్‌లో ఓ ప్రైవేట్ బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో సుమారు నలుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్సు 56 మంది ప్రయాణికులతో ఏర్కాడ్ నుంచి సేలం వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు 13వ హెయిర్‌పిన్ బెండ్ వద్దకు రాగానే డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు ఒక్కసారిగా సైడ్ వాల్‌ను ఢీ కొట్టి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 20 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏర్కాడ్ పోలీసులు తెలిపారు.

## బీజేపీ నేతలు చెప్పేవన్నీ అబద్ధాలే..



కేంద్ర ప్రాజెక్టుల యుటిలైజేషన్ సర్టిఫికేట్స్ పై బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. 32 కేంద్ర ప్రభుత్వ శాఖలు 52 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినప్పటికీ యూసీలను ఇప్పటి వరకు సమర్పించలేదని ఆమె విమర్శలు గుప్పించారు. ఉత్తర మాల్దా లోక్ సభ పరిధిలోని హరిశ్చంద్రపూర్ లో టీటీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ..మా ప్రభుత్వం 2.2 కోట్ల రూపాయలను ఖర్చు చేసి వాటికి సంబంధించిన యూసీలను సమర్పించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ సభలో ఆరోపించారు.



## నిక్కీ తంబోలి హాట్ ఫోటో షూట్

బిగ్ బాస్ ఫేమ్ నటి నిక్కీ తంబోలి మరోసారి ఫోటో షూట్ చేసింది. నిక్కీ తంబోలి తన బోల్డ్ చిత్రాలను పంచుకుంది. నటి నిక్కీ తంబోలి ప్రముఖ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 14లో కనిపించినప్పటి నుండి ముఖ్యాంశాలు చేస్తోంది. నిక్కీ తంబోలి తన బోల్డ్ యాక్టింగ్‌తో ముఖ్యాంశాలు చేస్తోంది. నిక్కీ తంబోలి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచుగా తన బోల్డ్ ఫోటోలను పంచుకుంది.నిక్కీ తంబోలి మరోసారి తన బోల్డ్ ఫోటోషూట్ చేసి తన కిల్లర్ స్టైల్‌తో తన అభిమానులకు షాక్ ఇచ్చింది.'బిగ్ బాస్'తో ఇంటి పేరు సంపాదించిన సౌత్ నటి నిక్కీ తంబోలి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది.



## ప్రత్యేక హోదాపై లోకేష్ కీలక వ్యాఖ్యలు

ఏపీకి ప్రత్యేక హోదాపై టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కలిసి పోటీ చేస్తున్న టీడీపీ.. ప్రత్యేక హోదాపై భరోసా ఇవ్వగలదా? అనే ప్రశ్నకు ఆ పార్టీ నేత లోకేష్ స్పందించారు. 'దేశంలో ప్రత్యేక హోదా కాన్సెప్ట్ ఇప్పుడు లేదు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఇన్సెంటివ్స్, కంపెనీలు తీసుకొచ్చేందుకు ప్రోత్సహిస్తాం.' అని లోకేష్ హామీ ఇచ్చారు.

## తగ్గిన వంటగ్యాస్ వాణిజ్య సిలిండర్ ధర





హోటళ్లు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్ ధర తగ్గింది. 19 కిలోగ్రాముల సిలిండరుపై చమురు విక్రయ సంస్థలు రూ.19 తగ్గించాయి. ఢిల్లీలో ధర రూ.1,764.50 నుంచి రూ.1,745.50కు చేరింది. హైదరాబాద్‌లో ఈ ధర రూ.1,994.50గా ఉంది. గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. 14.2 కిలోల సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.855 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలను సైతం సవరించలేదు. గత నెలలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరను రూ.30.50 తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు మార్చిలో రూ.25.50, ఫిబ్రవరిలో రూ.14 పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్లోని కదలికలకు అనుగుణంగా దేశీయంగానూ కంపెనీలు ప్రతినెలా ధరలను సవరిస్తుంటాయి.



## ఈవీఎంలకు 35 ఏళ్లు

దేశంలోని ఎన్నికల నిర్వహణలో ఈవీఎంలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈవీఎంను తొలిసారి 1989లో వినియోగంలోకి తీసుకురాగా.. ప్రయోగాత్మకంగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వీటిని వినియోగించారు. 2001లో పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలోనూ ఉపయోగించి ఎన్నికలు నిర్వహించారు. 2004లో దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో వీటిని ఉపయోగించారు.



## ఉక్రెయిన్ లోని 'హ్యారీపోటర్ కోట' ధ్వంసం

ఉక్రెయిన్ లోని నల్ల సముద్ర తీరంలో గల ఒడెస్సా నగరంలో 'హ్యారీపోటర్ కోట'గా ప్రసిద్ధి చెందిన ఓ విద్యా సంస్థ భవనాన్ని రష్యా క్షిపణులతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఈ ఘటనలో ఐదుగురు చనిపోగా.. మరో 30 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు. ఈ క్షిపణి పడిన చోటు నుంచి 1.5 కిలోమీటర్ల వరకు శకలాలు పడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



పవన్‌ను ఓడించకపోతే
నా పేరు పద్మనాభరెడ్డిగా
# మార్చుకుంటా

ఎక్కడి నుంచో ముఖానికి రంగులు వేసుకుని వచ్చేస్తే పిఠాపురం జనం ఓట్లు వేసి గెలిపించేస్తారనుకుంటున్నారా.. వారు తన్ని తరిమివేయడానికి సిద్ధంగా ఉన్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, వైకాపా నాయకుడు ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్‌ను ఓడించకపోతే తన పేరు ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. కాపుల రిజర్వేషన్ల కోసం ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని పవన్ కల్యాణ్ అడుగుతున్నారని.. వారిని ప్రశ్నించే హక్కు ఆయనకు ఎక్కడిదని అన్నారు.



'సీఎం జగన్ గారూ వీటికి సమాధానం చెప్పండి'
# వైఎస్ షర్మిల బహిరంగ లేఖ

సీఎం జగన్‌కు ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల బుధవారం బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిపై తాము అడుగుతున్న 'నవ సందేహాలు'కు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

లేఖలో నవ సందేహాలివే

1) ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన విషయం వాస్తవం కాదా?
2) సాగు భూమినిచ్చే కార్యక్రమాన్ని ఎందుకు నిలిపేశారు?
3) 28 పథకాలను అర్ధంతరంగా ఎందుకు ఆపివేశారు ?
4) ఎస్సీ, ఎస్టీ పునరావాస కార్యక్రమం రాష్ట్రంలో ఎందుకు నిలిచిపోయింది?
5) ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం పెట్టిన విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు ఎందుకు తీసేశారు?
6) దళిత, గిరిజన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి ఎందుకు సీట్లు నిరాకరించారు?
7) SC, STలపై రాష్ట్రంలో దాడులు పెరిగాయి. ఇది మీ వివక్ష కాదా?
8) దళిత డ్రైవర్ ను చంపి సూట్ కేసులో డోర్ డెలివరి చేసిన MLCని ఎందుకు సమర్థిస్తున్నారు?
9) స్టడీ సర్కిల్స్ కి నిధులు ఇవ్వకుండా వాటిని ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారు?. అంటూ బహిరంగ లేఖలో ప్రశ్నలు సంధించారు. వీటికి సమాధానం చెప్పాలంటూ లేఖలో డిమాండ్ చేశారు.

మరోవైపు, వైఎస్ షర్మిల ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఆమె గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నారు. అటు, వైసీపీ తరఫున ఎంపీ అవినాష్ రెడ్డి బరిలో నిలిచారు.

TS ICET

టీఎస్ ఐసెట్ దరఖాస్తుల
# గడువు పొడిగింపు

టీఎస్ ఐసెట్ -2024 దరఖాస్తుల గడువు పొడిగించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 30వ తేదీతో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ముగిసింది. కానీ అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఎలాంటి ఆలస్యం రుసుం లేకుండా మే 7వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ఐసెట్ కన్వీనర్ ఇవాళ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, కాకతీయ యూనివర్సిటీ వీసీ టీ రమేశ్, కన్వీనరగ్ ప్రొఫెసర్ ఎస్ నర్సింహాచారి కలిసి అధికారికంగా ప్రకటించారు.



జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్
# యాక్ట్ రద్దు చేస్తాం
## జనసేన అధినేత పవన్ కల్యాణ్

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో పట్టా పుస్తకాలపై ఆంధ్రప్రదేశ్ రాజముద్ర తీసి జగన్ ఫొటో వేసుకుంటున్నారని, లక్షల ఎకరాల ప్రజల ఆస్తుల్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ యాక్టును రద్దు చేస్తామన్నారు. ల్యాండ్, శాండ్, మైన్, వైన్, గంజాయి, ఎర్రచందనం, డ్రగ్స్, రేషన్ బియ్యం మాఫియాలతో రూ. 8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని మండిపడ్డారు. విషపూరిత మద్యం తెచ్చి 35 లక్షల మంది ఆరోగ్యాలను నాశనం చేశారని, 30 వేల మంది ప్రాణాలు తీసి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని దుయ్యబట్టారు. 'గృహ నిర్మాణం పేరుతో పేదల్ని అప్పులపాలు చేశారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను 600 మందిని హత్య చేశారు. వివేకా హత్యకేసులో నిందితుల్ని ఇంకా కాపాడుతూనే ఉన్నారు' అని మండిపడ్డారు. ఉండవల్లిలోని తెదేపా అధినేత చంద్రబాబు నివాసంలో తెదేపా, జనసేన, భాజపా ఉమ్మడి మ్యానిఫెస్టోను మంగళవారం విడుదల చేశారు. మ్యానిఫెస్టోలోని పలు కీలక అంశాలను పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'గత ఐదేళ్లుగా రాష్ట్రంలో నెలకొన్న విధ్వంసకర పరిస్థితులను చక్కదిద్ది గాడిలో పెట్టేందుకు ఎన్నికల రూపంలో ఒక మంచి అవకాశమొచ్చింది. వినాశకర పాలనను సాగనంపి స్వర్ణాంధ్రను నిర్మించుకోడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కూటమి అభ్యర్థులకు ఘనవిజయాన్ని చేకూర్చాలి. యువగళం, జనవాణి కార్యక్రమాల్లో వచ్చిన వినతులు, సూచనలతోపాటు ఆన్‌లైన్ ద్వారా అందిన సలహాలను క్రోడీకరించి ఈ మ్యానిఫెస్టోను రూపొందించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ.. ఇలా అన్ని రంగాల అభివృద్ధి కలగలిపి ఉంది. రాష్ట్ర ప్రజల నేటి అవసరాలను తీరుస్తూ.. రేపటి ఆకాంక్షలను సాకారం చేసే విధంగా తయారుచేసిన మ్యానిఫెస్టోను అమలు చేస్తాం' అని పేర్కొన్నారు.

ఒక్కో కుటుంబపై రూ.8 లక్షల భారం..

'ధరలు, పన్నులు, ఛార్జీల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ. 8 లక్షల భారం మోపారు. రూ. 10 ఇచ్చి రూ. 100 కొట్టేస్తున్నారు. పొద్దున్నే పథకం పేరుతో డబ్బులిచ్చి సాయంత్రానికి మద్యం పేరుతో దోచుకుంటున్నారు. పోలవరం, నదుల అనుసంధానాన్ని గోదాట్లో కలిపేశారు. సంపద సృష్టి ఉపాధి కల్పనా కేంద్రమైన రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. రూ.లక్ష కోట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపప్రణాళిక నిధుల్ని దారి మళ్లించారు. అన్నక్యాంటీన్లు, నిరుద్యోగ భృతి, పండుగ కానుకల వంటి 100కి పైగా కార్యక్రమాల్ని రద్దు చేశారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కోత వేసి 16,800 మంది బీసీలను రాజ్యాంగ పదవులకు దూరం చేశారు. స్థానిక సంస్థలకు కేంద్రమిచ్చిన రూ. 12 వేల కోట్లను దారి మళ్లించి గ్రామ, పట్టణాభివృద్ధిని దెబ్బతీశారు' అని మండిపడ్డారు.

లూటీ కోసమే అప్పు..

లూటీ కోసమే జగన్ రూ. 13 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించారని ధ్వజమెత్తారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు కత్తిమొన మీద వేలాడుతోంది. ఐదేళ్లుగా అన్ని రంగాల్లో రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తోంది. రాష్ట్రంలో ఎటు చూసినా అభద్రత, అశాంతి, హత్యలు, ఆత్మహత్యలే కనిపిస్తున్నాయి. పట్టభద్రుల నిరుద్యోగిత విషయంలో 24 శాతంతో దేశంలోనే ఏపీ మొదటిస్థానంలో ఉంది. రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో, 18 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారాల్లో రెండో స్థానంలో ఉంది' అని అన్నారు.





# 'పుష్ప 2 ది రూల్' నుంచి మరో పోస్టర్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ పుష్ప 2 ది రూల్. ఈ చిత్రం బన్నీ కెరీర్ లో కీలక మైలురాయిగా నిలిచిపోయిన పుష్ప ది రైజ్ చిత్రానికి సీక్వెల్. ఐకాన్ స్టార్ సరసన హీరోయిన్ గా రష్మిక మందన్న నటిస్తుండగా, రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కి సంబంధించిన టీజర్ ను రిలీజ్ చేయగా, నేషనల్ వైడ్ గా సెన్సేషన్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ ను ఇవాళ సాయంత్రం 5:04 గంటలకి రిలీజ్ చేయనున్నారు. పుష్ప.. పుష్ప అంటూ సాగే పాటను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. అయితే మేకర్స్ సాంగ్ ఎలా ఉండబోతుంది అనేది పోస్టర్ల ద్వారా తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్ మాస్ స్వాగ్ తగ్గేదేలే అనే విధంగా పోస్టర్లు ఉంటున్నాయి. ఈ లేటెస్ట్ పోస్టర్ ఆడియెన్స్ ను, ఫ్యాన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. ఆగస్ట్ 15, 2024 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

# చైనాలో కుప్పకూలిన రోడ్డు.. 19 మంది మృతి

దక్షిణ చైనాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ హైవేపై రోడ్డు కొంత భాగం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో సుమారు 19 మంది ప్రాణాలు కోల్పోయారు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 2:10 గంటల సమయంలో మీజౌ-డాబు కౌంటీ నగరాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. రహదారిపై ఉన్న రోడ్డులో కొంత భాగం కుప్పకూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న 18 వాహనాలు అందులో పడిపోయాయి. ఆ వాహనాల్లోని సుమారు 49 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు సుమారు 500 మంది సిబ్బందితో వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.




కూలిపోయిన ప్రాంతం నుంచి వారిందరినీ బయటకు తీసి సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వారిలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 30 మంది ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది.



తమిళనాడులో ఓ క్వారీలో భారీ పేలుడు,
# నలుగురు కార్మికులు మృతి

తమిళనాడులోని విరుదునగర్లోని ఓ క్వారీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. అయితే... మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదముందని అంటున్నారు అధికారులు. పేలుడు ధాటి ఆ స్థాయిలో ఉందని వివరిస్తున్నారు. అక్కడి సీసీ కెమెరాలో ఈ పేలుడు దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. ప్రాథమిక విచారణ ప్రకారం...క్వారీలోని స్టోరేజ్ రూమ్లో ఈ పేలుడు సంభవించింది. అందులో పేలుడు పదార్థాలున్నాయని తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ టీమ్స్ అక్కడి శిథిలాల్ని చాలా జాగ్రత్తగా తొలగిస్తోంది. ఇంకేమైనా పేలుడు పదార్థాలున్నాయేమో అని పరిశీలిస్తోంది. అయితే..చాలా రోజులుగా స్థానికులు ఈ క్వారీపై ఫిర్యాదులు చేస్తున్నారు. గాలి కలుషితం అవుతోందని, తమ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే చాలా సార్లు ఇక్కడ ప్రమాదాలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదానికి కాసేపటి ముందే తాత్కాలికంగా ఈ క్వారీని మూసేశారు. దీన్ని శాశ్వతంగా మూసేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

హాట్ లుక్‌లో
# షామా సికందర్

షామా సికందర్ తన నిర్భయ దృక్పథాన్ని మరోసారి ప్రదర్శించారు. నటి షామా సికిందర్ ఈ రోజుల్లో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉన్నారు.ఇటీవల, ఆమె తన కొత్త ఫోటోషూట్ చిత్రాలను తన అభిమానులతో పంచుకుంది, అందులో ఆమె 40 ఏళ్ల వయస్సులో కూడా బోల్డ్ మరియు బోల్డ్‌గా కనిపిస్తోంది. షామా తెలుపు మరియు నలుపు దుస్తులలో చాలా బాగుంది. ఫోటోలు పోస్ట్ చేయబడ్డాయి. నటి కొత్త లుక్‌లో చాలా అందంగా ఉంది. అభిమానులు ఆమె రూపాన్ని ఇష్టపడుతున్నారు. షామా సికందర్ అనేక వెబ్ సిరీస్‌లలో కనిపించారు. షామా సికందర్ తన బోల్డ్ లుక్‌ల కోసం సోషల్ మీడియా సందడిలో ఉన్నారు.

